




వేసవిలోనూ జలకళ

- వైసీపీ ప్రభుత్వంలో వెలవెల
- రిజర్వాయర్లు, చెరువుల్ని ఎండబెట్టిన వైనం
- ప్రస్తుత ప్రభుత్వం ముందు చూపు
- వేసవి గండం గట్టెక్కేలా చర్యలు

పుట్టపర్తి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలోనూ రిజర్వాయర్లు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ముందు చూపు లేకుండా అనాలోచిత నిర్ణయాలతో జిల్లాలో జలఘంటికలు మోగాయి. సాగు,తాగు నీటికి వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా సుజల స్రవంతికి ప్రస్తుత ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం వల్లే వేసవి తాపంలోనూ నీటి గలగలలు వచ్చాయి. 2023-24లో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందుచూపులేకపోవడంతో జిల్లాలో జలాశయాలు, చెరువుల్ని ఎండబెట్టింది. ఫలితంగా వేసవిలో జిల్లా ప్రజలకు తాగు,సాగునీటి కష్టాలను తెచ్చిపెట్టింది. ఆ పరిస్థితి తలెత్తకుండా ప్రస్తుత ప్రభుత్వం ముందు చూపుతో హంద్రీనీవా కాలువ కింద జిల్లాలో మూడు ప్రధాన రిజర్వాయర్ల, వందలాది చెరువులు నీటితో నింపింది. ఈ నేపథ్యంలో వేసవిలో సమస్య రాకపోవచ్చని తెలుస్తోంది. మరోవైపు హంద్రీనీవా కాలువ ఆధునికీకరణకు ప్రధాన కాలువ జీడిపల్లి నుంచి రాప్తాడు, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజక వర్గాల్లో ఐదు ప్యాకేజీలుగా విభజించి రూ. 936.70 కోట్ల అంచనాలతో లైనింగ్ పనులు చేపడుతున్నారు.



నిండుగా చెర్లోపల్లి రిజర్వాయర్

కృష్ణా జలాలతో జిల్లాలో రిజర్వాయర్లతో పాటు చెరువులకు జలకళ వచ్చింది. శ్రీశైలం జలాశయం నుంచి ఇప్పటిదాకా రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో 27 టీఎంసీలకు పైగా రిజర్వాయర్లతోపాటు వందలాది చెరువులకు నీటిని ఇచ్చారు. జీడిపల్లి జలాశయం నుంచి రెండో దశలో ప్రధాన కాలువతోపాటు మడకశిర, పుంగనూరు ఉపకాలువ కింద రిజర్వాయర్లు, చెరువులకు జలకళ వచ్చింది. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో రిజర్వాయర్ల, చెరువుల్లో జల ఘంటికలు మోగాయి. గొల్లపల్లి జలాశయం పూర్తి సామర్థ్యం 1.913 టీఎంసీలు కాగా ప్రస్తుతం

నీటితో కళకళలాడుతున్న గొల్లపల్లి రిజర్వాయర్

వేసవి గండం గట్టెక్కినట్టే..

0.700 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. బుక్కపట్నం మండలం మారాల జలాశయం సామర్థ్యం 0.483 టీఎంసీలు కాగా 0.125 టీఎంసీలు నిరు ఉంది. కదిరి మండలం చెర్లోపల్లి జలాశయం 1.608 టీఎంసీలు సామర్థ్యం ఉంటే ప్రస్తుతం 1.350 టీఎంసీలు నిల్వ ఉంది. రాప్తాడు, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజక వర్గాల్లో వందలాది చెరువుల్లో తగినంత నీరు ఉంది. ఈ ఏడాది గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉపకాలువకు ఒక టీఎంసీ నీరు వదలగా పెనుకొండ, హిందూపురం నియోజక వర్గాల్లో 23 చెరువులకు నీరు చేరింది. గత ఏడాదితో పోల్చితే ఏప్రిల్ మాసంలో రిజర్వాయర్లతోపాటు చెరువుల్లో నీరు లభ్యతతో ఈ వేసవిలో సాగు, తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితితులు ఉన్నాయి. ప్రభుత్వ ముందు చూపుతోనే 2024 అక్టోబరు నుంచి కృష్ణా జలాలు జిల్లాలో ప్రవేశించి రిజర్వాయర్ల, చెరువులకు జలకళ తీసుకువచ్చారు. చెరువుల, రిజర్వాయర్ల కింద వరి, వేరుశనగ, మొక్కజొన్నతోపాటు పలు రకాల వాణిజ్య పంటలు సాగుతో పచ్చదనం సంతరించుకుంది.

గత ప్రభుత్వ నిర్వాకంతో..

వైసీపీ ప్రభుత్వంలో ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో 2023-24లో జిల్లా ప్రజలకు శాపంగా మారింది. హంద్రీనీవా ద్వారా సకాలంలో రిజర్వాయర్ల, చెరువుల్ని నింపకపోవడంతో సాగు, తాగు నీటికి కటకటలాడే పరిస్థితి వచ్చింది. జలాశయాలు, చెరువుల్లో నీరులేక భూగర్భజల మట్టం తగ్గడంతో అటు రైతాంగానికి ఇటు తాగునీటికి జల ఘంటికలు మోగాయి. జీడిపల్లి నుంచి రెండో దశ కింద వచ్చిన నీరంతా.. కుప్పానికి కృష్ణా నీళ్ల పేరిట షో కోసం ఆనాటి సీఎం జగన్ జిల్లాలో రిజర్వాయర్లు, చెరువుల్ని ఎండబెట్టారు. జలాశయాలు, చెరువుల కింద ఆయకట్టుతోపాటు వేసవిలో ప్రజల దాహార్తి కేకలు వినిపించాయి. గొల్లపల్లి నుంచి మడకశిర ఉపకాలువకు నీళ్లు ఇవ్వకుండా తొలిసారిగా ఎండబెట్టారు. వరి, వేరుశనగ, మల్బరీ, మొక్కజొన్నతో పాటు వాణిజ్య పంటలు నిలువునా ఎండిపోయి రైతులు రుణ భారం మూటగట్టుకున్నారు.



గత ఏడాది గొల్లపల్లి జలాశయంలో అడుగంటిన నీరు (ఫైల్)

గుట్ట చప్పుడు కాకుండా..

గుట్టల భూములు ప్రైవేటుకు..!

- 200 ఎకరాల అప్పగింతకు రంగం సిద్ధం
- సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు
- అడ్డుకుంటామంటున్న మల్లిరెడ్డిపల్లి ప్రజలు



ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న గుట్టలివే

తనకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేటుకు అప్పగించడానికి రెవెన్యూ యంత్రాంగం రంగం సిద్ధం చేసిన ట్లు సమాచారం. మండలంలోని మల్లిరెడ్డిపల్లి గ్రామ పొలంలో ఏక్ గుట్ట నుంచి పెండ్లిగుండుతండా వరకు వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిలో గుట్టలున్నాయి. వీటిలో అనేక రకాల చెట్లు కూడా పెరిగాయి. వీటిని వడ్డుమరవపల్లి గ్రామస్థులు కొన్నేళ్లుగా కాపాడుకుంటున్నారు. అలాగే ఎంతోమంది భూమిలేని నిరుపేదలు ఈ గుట్టల్లోని భూమిని సాగు చేసుకుని జీవిస్తున్నారు. ఇందులో పలువురికి పట్టాలు కూడా ఉన్నాయి. మిగిలిన ప్రభుత్వ భూములను గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి రెవెన్యూ యంత్రాం గం రంగం సిద్ధం చేసినట్లు మల్లిరెడ్డిపల్లి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తమ తాత, ముత్తాతల కాలం నుంచి పశువులు, గొర్రెలు, మేకలు ఈగుట్టల్లోనే మేపుకుంటూ జీవిస్తున్నట్లు వారు తెలిపారు. తమకు అవసరమైన వంట చెరకు, బోద, పశువులకు కావలసిన గడ్డి, ఆకు, అన్ని అవసరాలకు ఈ గుట్టలు ఉపయోగపడుతున్నట్లు వివరించారు.

15 రోజుల నుంచి అలజడి

గత 15రోజులుగా కొత్తవ్యక్తులు ఈగుట్టల్లో సంచరిస్తూ, సర్వేలు నిర్వహిస్తున్నారు. ఫొటోలు కూడా తీస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. వీరితోపాటు స్థానిక రెవెన్యూ అధికారులు కూడా ఉన్నట్లు వివరించారు. ఈగుట్టల్లో రెండువందల ఎకరాలకు పైబడిన ప్రభుత్వ భూమిని సోలార్ ఏర్పాటు చేయడానికి ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈవిషయంపై అన్నిగ్రామాల్లో చర్చించి అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామస్థుల అభిప్రాయాలను కాదని, భూమిని సోలార్‌కు అప్పగించే ప్రయత్నం చేస్తే ఆందోళనలు చేపట్టక తప్పదన్నారు. ఈవిషయాలను ఇప్పటికే గ్రామ సర్పంచ్, కార్యదర్శి, ఎంపీటీసీ, ఎంపీపీ, స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంటకప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

- ఈవిషయంపై తహసీల్దార్ శోభా సువర్ణమ్మను వివరణ కోరడానికి ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

గంజాయి రవాణాను నిరోధించండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, ఓపీఎం, ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణాను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ రత్నతో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాను నిరోధించడానికి పోలీసులు, అటవీ, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలను రూపు మాపడమే ధ్యేయంగా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసమే ఈగల్ టీమ్‌నుఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణ ప్రచార పోస్టర్లను కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, హేమంత్, ఎక్సైజ్ శాఖ అధికారి గోవిందునాయక్, డీఈఓ క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఎస్పీ రత్నతో కలిసి కలెక్టర్ జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాల సంఖ్యను తగ్గించి, మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనదారులు రోడ్డుపై వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి కరుణసాగర్‌రెడ్డి, కదిరి ఎంవీఐ శ్రీనివాసరావు, ఎన్‌హెచ్ అధికారి భరత్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటాలని కలెక్టర్ పేర్కొన్నారు. అటవీ శాఖ, నేషనల్‌హైవే, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 1,74,065 హెక్టార్లలో 10.43లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అవసరమైన మొక్కలను సరఫరా చేయాలని డీఎఫ్‌ఓ చక్రపాణిని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, పశుసంవర్ధకశాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, అటవీ అధికారి యామిని సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



జోరుగ లాగు..

- మొరాయించిన పోలీసు వాహనం
- లాక్కెళ్లిన ఇసుక ట్రాక్టర్

మొరాయించిన సీఐ వాహనాన్ని ఇసుక ట్రాక్టర్‌కు కట్టి తీసుకెళ్తున్న దృశ్యం

ఈ ఫొటోను చూసి.. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసు వాహనం వెంబడిస్తోంది అనుకుంటే.. పొరబడినట్లే..! పాడైపోయిన పోలీసు వాహనాన్ని ఇలా తాడుతో ఇసుక ట్రాక్టర్ లాక్కెళుతోంది. పెనుకొండ సీఐ వాహనం మంగళవారం మొరాయించడంతో మడకశిర రోడ్డు నుంచి మెకానిక్ షాపువద్దకు వెళ్లడానికి ఇలా ఇసుక ట్రాక్టర్‌కు కట్టుకుని వెళ్లాల్సి వచ్చింది. వాహనాలు పాతబడటంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, కొత్త వాహనాలు ఇస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వినవస్తున్నాయి.

-ఆంధ్రజ్యోతి, పెనుకొండ టౌన్

దీర్ఘకాలిక కేసులపై దృష్టి పెట్టండి

- ప్రాపర్టీ కేసుల్లో రికవరీలు పెరగాలి
- ఎస్పీ రత్న ఆదేశాలు



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని ఎస్పీ రత్న.. పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సబ్‌డివిజన్ వారీగా డీఎస్పీలు, సీఐలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి, నేరాలను అదుపుచేయడంతో పాటు నేరస్తులను పట్టుకోవాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీలు పెంచాలన్నారు. పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం మోపాలన్నారు. గస్తీ ముమ్మరం చేయడంతోపాటు సోషల్ మీడియాపై నిఘా పెంచాలన్నారు. పోలీసు అధికారులు గ్రామాల్లో పర్యటించి, పల్లెనిద్రలు చేయాలన్నారు. సైబర్‌నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వివిధ కేసుల దర్యాప్తులో ప్రతిభ కనబరచిన 44 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు. సమీక్షలో డీఎస్పీలు విజయ్‌కుమార్, శివనారాయణస్వామి, నరసింగప్ప, హేమంత్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆమెదే అధికారం..!

రెండు దశాబ్దాలుగా కదిరి పీఠం మహిళలకే..

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మైనార్టీ వర్గీయులే..



షహనాజ్ షాకీర్



ఫర్హానాఫయాజ్



సురయాబాను

కదిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల నుంచి కదిరి మున్సిపాల్టీకి మహిళలే చైర్‌పర్సన్లుగా ఎన్నికవుతున్నారు. తొలిసారి ఎన్నికైనా ఎటువంటి బెరుకు లేకుండా కౌన్సిల్ సమావేశాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పురుష కౌన్సిలర్లు ఉన్నా కూడా ఎన్నో క్లిష్ట సమస్యలను ఎదుర్కొని తమను తాము నిరూపించుకుంటున్నారు. కాబోయే చైర్‌పర్సన్ కూడా మహిళే అని ప్రచారం సాగుతోంది.



నజీమున్నీసా

2000 సంవత్సరం నుంచి...

కదిరి మున్సిపాల్టీ చైర్మన్ పీఠాన్ని 2000 సంవత్సరంలో తొలిసారిగా షహనాజ్ షాకీర్ అధిరోహించారు. ఆమె 2005 సంవత్సరం వరకు చైర్‌పర్సన్‌గా కొనసాగారు. తరువాత 2005 నుంచి 2009 వరకు వేముల ఫర్హానా ఫయాజ్ చైర్‌పర్సన్‌గా కొనసాగారు. మరో సంవత్సరం పాటు కేవీ రామచంద్రారెడ్డి చైర్మన్‌గా కొనసాగారు. 2010 నుంచి 2014 వరకు ఎన్నికలు జరగకపోవడంతో స్పెషలాఫీసర్ పాలన కొనసాగింది. తిరిగి 2014 సంవత్సరంలో మున్సిపల్ ఎన్నికలు జరగడంతో షేక్ సురియాబాను చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఆమె 2019 సంవత్సరం వరకు చైర్‌పర్సన్‌గా ఐదేళ్ల పాటు కొనసాగారు. తరువాత 2021 నుంచి 2025 సంవత్సరం ఏప్రిల్ 23 వరకు నజీమున్నిసా చైర్‌పర్సన్‌గా కొనసాగారు.

కలిసివచ్చిన రిజర్వేషన్లు

కదిరి మున్సిపాల్టీలో మహిళలు చైర్‌పర్సన్‌లు కావడానికి రిజర్వేషన్లు కలిసి వచ్చాయి. 2000 సంవత్సరంలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చైర్మన్‌ను ఎన్నుకున్నారు. చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ కావడంతో మాజీ మంత్రి షాకీర్ సతీమణి షహనాజ్ షాకీర్‌ను చైర్‌పర్సన్ ఎన్నుకున్నారు. 2005లో వేముల ఫర్హానా ఫయాజ్‌కు మహిళ రిజర్వేషన్ లేకున్నా సామాజిక సమీకరణాల దృష్ట్యా చైర్‌పర్సన్ పదవి దక్కింది. 2014లో చైర్‌పర్సన్‌గా పదవి చేపట్టిన సురయాబానుకు బీసీ మహిళ రిజర్వేషన్ రావడంతో పదవి వరించింది.

2021లో జనరల్ మహిళకు చైర్మన్ పదవి రిజర్వు కావడంతో మైనార్టీ మహిళకు చైర్‌పర్సన్ పదవి ఇస్తామని టీడీపీ, వైసీపీలు ప్రజలకు వాగ్దానం ఇచ్చాయి. దాని ప్రకారం నజీమున్నీసా చైర్‌పర్సన్ పదవి కైవసం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్నికైన చైర్‌పర్సన్లందరూ మైనార్టీ వర్గానికి చెందిన వారే.

మళ్లీ మహిళకే చాన్స్

చైర్‌పర్సన్ నజీమున్నిసాపై అవిశ్వాసం నెగ్గిన తరువాత చైర్‌పర్సన్ స్థానం ఖాళీ అయ్యింది. రిజర్వేషన్ ప్రకారం జనరల్ మహిళకు చైర్‌పర్సన్ పదవి దక్కుతుంది. ప్రస్తుత కౌన్సిల్‌లో దాదాపు 20 మంది దాకా మహిళా కౌన్సిలర్లు ఉన్నారు. రిజర్వేషన్ మహిళలకు ఉండటంతో వీరిలో ఎవరైనా చైర్‌పర్సన్ అవ్వడానికి అర్హులే. అయితే మైనార్టీ వర్గానికి చెందిన మహిళలకే చైర్‌పర్సన్ పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి.

నేటి నుంచి స్లాట్ బుకింగ్

పుట్టపర్తి, ఏప్రిల్ 29(ఆంధ్ర జ్యోతి): రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభంగా, వేగంగా జరిగేందుకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానం బుధవారం నుంచి జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి వస్తున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి తెలిపారు. హిందూపురం, సీకేపల్లి, ధర్మవరం, తనకల్లు, కదిరి, చిలమత్తూరు, మడకశిర, పెనుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 దాకా స్లాట్ బుకింగ్ విధానం అమల్లో ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా నిర్దిష్ట సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చునని జిల్లా రిజిస్ట్రార్ తెలిపారు.

విద్యా వ్యవస్థకు
6 ఆదర్శం
పంచాయతీకో మోడల్ ప్రైమరీ స్కూల్..

విద్యా వ్యవస్థకు ఆదర్శం

స్కూళ్లలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం

● పంచాయతీకో మోడల్ ప్రైమరీ స్కూల్.. ● వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను అన్వేషిస్తోంది. ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించిన జీఓనెంబరు 117కు ప్రత్యామ్నాయంగా ఆదర్శపాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈవిధానంపై విద్యాశాఖలో తీవ్ర కసరత్తు జరుగుతోంది.

ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు

జిల్లాలో 287 పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మార్చేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. గత ఏడాది డిసెంబరు ఆఖరునాటికి కనీసం 60 మంది విద్యార్థులున్న పాఠశాల లను ఎంపిక చేయనున్నారు. అయితే పంచాయతీలో ఏ పాఠశాలలోనూ అంతమంది విద్యార్థులు లేకపోతే 45 మంది విద్యార్థులున్న పాఠశాల లను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు సమాచారం.

287 పాఠశాలల మార్పు

ఎంపిక చేసిన ఆదర్శపాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమిస్తారు. విద్యార్థుల సంఖ్య 60 మందికి లోపు ఉంటే ఐదుగురు ఎస్జీటీలు ఉంటారు. ఆసంఖ్య 120 వరకు ఉంటే ప్రధానోపాధ్యాయుడిని నియమిస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరమైతే రెండో పాఠశాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వనున్నారు.

గ్రామస్థులు కోరితే..

గ్రామపంచాయతీలో ఏ ప్రాథమిక పాఠశాలలోనైనా విద్యార్థుల సంఖ్య 45 మందికి మించి ఉంటే గ్రామస్థుల కోరిక మేరకు ఆపాఠశాలను ఆదర్శపాఠశాలగా మార్చనున్నారు. గ్రామపంచాయతీ తీర్మానం, విద్యాకమిటీ ఛైర్మన్, ఇతర సభ్యుల ఆమోదంతో ప్రక్రియను పూర్తి చేస్తారు.

విభజన ఆరు రకాలుగా....

జిల్లాలో మొత్తం 2097 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1553 ప్రాథమిక పాఠశాలలు, 229 ప్రాథమికోన్నత పాఠశాలలు, 315 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిని ఆరురకాల పాఠశాలలుగా విభజించనున్నారు. ఇందులో ఆదర్శ పాఠశాలలు ప్రధానమైనవి. ప్రాథమిక విద్యలో నాణ్యతాప్రమాణాలు పెంచడమే ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేయడంలో ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో ప్రస్తుత పాఠశాల ప్రాంగణాల్లో మౌలిక వసతులు, నూతనంగా కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రాథమిక నివేదికలు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఎంఈఓలను ఆదేశించారు.





ఆదర్శ పాఠశాల

విలీనం చేసిన తరగతులు వెనక్కు

వైసీపీ పాలనలో 3, 4, 5, తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో నివాసానికి దూరంగా ఉన్న పాఠశాలకు వెళ్లలేక ఎక్కువ మంది విద్యార్థులు బడి మానేశారు. చాలా పాఠశాలల్లో అతితక్కువ మంది విద్యార్థులు మిగిలారు. కొన్ని పాఠశాలల్లో ఒకరు ఇద్దరు విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు. అయితే ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో విలీనమైన తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది.



పుట్టపర్తి పట్టణం

సులభంగా అనుమతులు

కమిషనర్లకే పర్మిషన్ బాధ్యతలు

మున్సిపాల్టీలో ఐదంతస్తుల నిర్మాణం వరకూ...

బిల్డర్లకు తప్పిన వ్యయ ప్రయాసలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మునిసిపాలిటీల్లో ఐదంతస్తుల భవననిర్మాణ అనుమతులు సులభతరం అయ్యాయి. గతంలో నాలుగు అంతస్తులకు మించి భవన నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికారులు అనుమతి ఇచ్చేవారు కాదు. దీంతో పుడా, లేదా అహుడా అధికారుల నుంచి అనుమతి పొందాల్సి వచ్చేది. ఇందుకోసం భవన నిర్మాణదారులు ఎన్నో వ్యయప్రయాసలు ఓర్వాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్లకే అనుమతి అధికారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు ఫిబ్రవరి 2న జీఓ ఎంఎస్ నెంబరు 20ను విడుదల చేసింది. దీన్ని అనుసరించి ప్రజలు సులభంగా స్వీయ అంగీకార ధ్రువీకరణ పత్రం అందజేసి భవననిర్మాణ అనుమతులు పొందడానికి వీలు కల్పించారు. ఈ విధానం ద్వారా బిల్డర్లకు బహుళ అంతస్తులను నిర్మించుకునే విషయంలో ఊరట కలిగింది. దీంతో నిర్మాణ రంగం ఊపందుకునే అవకాశం ఉన్నట్లు పలువురు అభిప్రాయ పడుతున్నారు.


ఏకకాలంలో అనుమతులు

ఏకకాలంలో అనుమతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఒకే పోర్టల్‌లో అన్ని అనుమతులు పొందే అవకాశం కలిగింది. గత ప్రభుత్వంలో బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతుల కోసం వేచిచూసే కార్యక్రమంతో పాటు లక్షల్లో డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. దీంతో వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్మాణరంగం పూర్తిగా కుదేలైంది. ఈ సమస్యలను గుర్తించిన ప్రస్తుత మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణ భవన నిర్మాణాలకు ఏకకాలంలో అనుమతుల మంజూరు చేసే విధానానికి శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణ అనుమతులు స్థానికంగా ఉన్న మున్సిపల్ కమిషనర్ పరిధిలోనే జరుగుతుండటంతో బిల్డర్లకు వెసులుబాటు లభించింది. వారికి వ్యయప్రయాసలు తప్పాయి. దీంతో జిల్లాలోని ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం వంటి మున్సిపాలిటీల్లో బహుళ అంతస్తుల భవననిర్మాణాలకు ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందే అవకాశం ఏర్పడింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుదారులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని లైసెన్సుడు టెక్నికల్ సర్వేయర్, ఇంజనీర్‌కు ఆన్‌లైన్‌లోకాని నేరుగా కాని అందజేయవచ్చని పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్ ప్రహ్లాద తెలిపారు.



ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్

ఎదురుచూపులు ఎన్నాళ్లు..?



ఆర్భాటంగా బీసీ రుణాల మెగా చెక్కు విడుదల

20 రోజులు కావస్తున్నా...

లబ్ధిదారుల ఖాతాలకు జమకాని డబ్బు

విడుదల కాని బడ్జెట్

పొదుపు ఖాతాల ఫ్రీజ్‌తో ఇబ్బందులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పలేదు. ఆర్భాటంగా రుణాల మెగా చెక్కు విడుదల చేసి, డబ్బు మాత్రం జమ చేయలేదని వారు వాపోయారు. కార్పొరేషన్ ద్వారా బీసీ వర్గాలకు సబ్సిడీ రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రక్రియ చేపట్టింది. అన్నీ అనుకున్నట్లుగానే దరఖాస్తులు చేసుకోవడం... వెరిఫికేషన్.. బ్యాంకర్లకు అందజేయడం... ఆర్భాటంగా ఈనెల 11వ తేదీన అదికూడా జ్యోతిబాపూలే జయంతి రోజున రూ.11.61 కోట్ల మెగాచెక్కును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేశారు. ఇక రెండుమూడ్రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలకు రుణం మొత్తం జమవుతుందన్న ప్రచారం జోరుగా సాగింది. సీన్ కట్ చేస్తే... మెగా చెక్కు విడుదల చేసి 20 రోజులవుతున్నా... జిల్లాలో ఒక్కరంటే ఒక్క లబ్ధిదారుడి కీ రుణం అందిన దాఖలాలు లేవనే చెప్పాలి. దీంతో లబ్ధిదారులకు నిట్టూర్పు తప్పడం లేదు.

సేవింగ్స్ ఖాతాలు ఫ్రీజ్

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల పంపిణీ ప్రక్రియకు సంబంధించి తతంగమంతా ముగిసిందనే చెప్పాలి. ఈ నేపథ్యంలోనే మెగా చెక్కు విడుదల అనంతరం దరఖాస్తులు ఆయా బ్యాంకర్లకు వెళ్లిపోయాయి. ఆయా బ్యాంకర్లు.. సిబిల్ స్కోరు తదితరాలను పరిశీలించి, లబ్ధిదారుల ఖాతాను ఫ్రీజ్ చేశారు. ఇక్కడే కొందరు బ్యాంకర్లు తప్పులే కాలేశారు. సబ్సిడీ రుణాలు విడుదల చేయాలంటే... లబ్ధిదారుడికి ఖాతా ఉన్న బ్యాంకులో రుణానికి మరో ఖాతా తెరిచేవారు. ఈసారి కొందరు బ్యాంకర్లు.. లబ్ధిదారుడికి ఉన్న ఒకే ఒక సేవింగ్స్ ఖాతాను ఫ్రీజ్ చేశారు. అందులోనూ సబ్సిడీ మొత్తాన్ని హోల్డ్ చేసి... మిగిలిన రుణం మొత్తాన్ని మైనస్‌లో చూపించేశారు. ఇదంతా బ్యాంకు సేఫ్టీ ప్రకారం చూసుకున్నారనప్పటికీ.. మైనస్‌లో చూపిస్తుండటంతో లబ్ధిదారులు బ్యాంకు లావాదేవీలు జరిపేందుకు వీలులేకుండా పోయిందనే చెప్పాలి. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా... మెగా చెక్కు విడుదలై 20 రోజులు కావస్తున్నా రుణాలు అందకపోవడం, మే నెల వస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అకౌంట్‌లో మైనస్ చూపిస్తుండటంతో ఆ నెలలో ఈఎంఐలు కట్టుకునే వారి పరిస్థితి దయనీయంగా మారిందనే చెప్పాలి. దీనిపై పలువురు లబ్ధిదారులు.. బీసీ కార్పొరేషన్ అధికారుల వద్ద వాపోయినట్లు సమాచారం.

విడుదలకాని బడ్జెట్..?

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతోనే బీసీ కార్పొరేషన్ రుణాలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆ శాఖ ద్వారా అందిన సమాచారం. జ్యోతిబాపూలే జయంతి రోజున ఆర్భాటంగానే మెగా చెక్కు విడుదల చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ రుణాలకు సంబంధించి బడ్జెట్ రిలీజ్ చేయడంలో ఆలస్యం కావడమే ప్రధాన కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ శాఖాధికారుల ద్వారా అందిన సమాచారం మేరకు... మే 15వ తేదీలోపుగానీ, మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

సమాచారం లేదు

లబ్ధిదారుల ఖాతాలకు రుణ మొత్తాలు జమయ్యే అంశం మా పరిధిలో లేదు. నిధులు విడుదలైతే లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమవుతాయి.

- సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్





ఈనెల 11న కలెక్టర్, ఎంపీ ఆధ్వర్యంలో విడుదల చేసిన మెగాచెక్కు

అనంతకు వరం.. ఆర్డీటీ: గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఆర్డీటీ ఒక వరమని గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్ మొద్దీన్ అన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన జిల్లాలో 56 ఏళ్లుగా ఆర్డీటీ విద్య, వైద్య సేవలు అందిస్తోందని, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందని అన్నారు. ఎంతో మంది క్రీడాకారులను తయారుచేసిన ఘనత ఆర్డీటీదని అన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో ఆస్పత్రుల ద్వారా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. ఆర్డీటీ సహకారంతోనే తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జిల్లాలో డిజిటల్ గ్రంథాలయాన్ని పూర్తి చేశామని అన్నారు. ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని, నిధులు అందేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం అయ్యేలా చూస్తామని అన్నారు.

క్రమబద్ధీకరణపై సమాలోచనలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది క్రమబద్ధీకరణపై ఆయా శాఖల ఉన్నతాధికారులు సమాలోచనలు జరిపారు. జేడీఏ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఉద్యాన శాఖ డీడీ ఫిరోజ్ ఖాన్, సెరికల్చర్ డీడీ అంజనేయులు, జేడీఏ ఆఫీస్ టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్, హెచ్ఓ రత్నకుమార్‌లు సిబ్బంది క్రమ బద్ధీకరణపై మంగళవారం సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని 450 రైతు సేవా కేంద్రాల పరిధిల్లో 189 ఉద్యాన సహాయకులు, 123 మంది వ్యవసాయ సహాయకులు, 9 మంది పట్టు పరిశ్రమ సహాయకులు, 189 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. క్లస్టర్ వారిగా ఆయా పరిధిల్లో ఏఏ రకాల పంటలు ఎక్కువగా సాగువుతున్నాయో ఆయా శాఖల సిబ్బందిని అక్కడ నియమించేందుకు జాబితాలు తయారు చేయాలని నిర్ణయించారు. క్రమబద్ధీకరణ తర్వాత సిబ్బంది బదిలీలు జరిగేలా రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.



చర్చిస్తున్న వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు

ఆర్డీటీకి అండగా ఉంటాం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్/కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి అండగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆ సంస్థ కార్యాలయంలో ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను మంగళవారం కలిశారు. విదేశీ నిధులు ఆగిపోయిన కారణంగా నిలిచిపోయే సేవల గురించి ఆరా తీశారు. ఆర్డీటీకి అండగా నిలవాలని ఇప్పటికే ఎమ్మెల్యేలందరం చర్చించుకున్నామని, త్వరలోనే సీఎం చంద్రబాబును కలుస్తామని ఆయనకు తెలిపారు. మే 2న ప్రధాన మంత్రి రాష్ట్రానికి వస్తున్నారని, ఆయన దృష్టికి ఆర్డీటీ అంశాన్ని తీసుకువెళతామని అన్నారు.




మాంచో ఫెర్రర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

సేవ్ ఆర్డీటీ..

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అయ్యేలా సహకరించాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సేవ్ ఆర్డీటీ కమిటీ సభ్యులు కోరారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో కమిటీ సభ్యులు షకీల్ షఫి, సీపీఎం నాయకుడు రాంభూపాల్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ తదితరులు ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సీఎం, ప్రధాని దృష్టికి తీసుకువెళతామని, అవసరమైతే తానే ఢిల్లీకి వెళతానని అన్నారు.

ఆర్డీటీ కోసం ఉద్యమిద్దాం: జేసీ ప్రభాకర్ రెడ్డి



ఆర్డీటీని బతికించుకుందామంటూ ప్రదర్శన చేస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ కోసం పార్టీలకు అతీతంగా కలిసి ఉద్యమిద్దామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కూడలి వద్ద మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ప్రదర్శన చేశారు. విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ఆర్డీటీ కార్యాలయానికి చేరుకొని మాంఛో ఫెర్రర్‌ను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరువు జిల్లా ప్రజలకు ఆర్డీటీ అనేక సేవలు అందిస్తోందని అన్నారు. కొవిడ్ సమయంలో ఆర్డీటీ అందించిన వైద్య సేవలు ఎవరూ మర్చిపోలేరని అన్నారు.ప్రభుత్వం చేయలేని పనులు కూడా ఆర్డీటీ సంస్థ చేస్తోందన్నారు. ఆర్డీటీ కోసం పార్టీలకు అతీతంగా నాయకులంతా కలిసి రావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని, సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి ఆర్డీటీని బతికించుకుందామన్నారు.


ఎట్టకేలకు పట్టారు..!

అక్రమ పట్టాల రద్దుకు రంగం సిద్ధం

37మంది అనర్హులకు నోటీసులు జారీ

సంజాయిషీ కోసం నేడు ఆర్డీఓ వద్దకు..

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో అక్రమాల తతంగం



కుణుతూరు జగనన్న లేఅవుట్ ఇళ్ల నిర్మాణం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో అనర్హుల పట్టాల రద్దుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అక్రమంగా పట్టాలు పొందారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ విచారణలో వారంతా అనర్హులని తేలింది. దీంతో అనర్హుల జాబితాను సిద్ధం చేసి వారి పట్టాలను రద్దు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే వారి పట్టాల రద్దుకు నోటీసులు జారీచేశారు. ఆర్డీఓ వద్ద సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

167 మందికి పట్టాల పంపిణీ

ధర్మవరం మండలంలోని కుణుతూరు పంచాయతీలో 167మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మామిళ్లపల్లి-ధర్మవరం ప్రధాన రహదారికి ఆనుకుని పట్టాలు పంపిణీ చేశారు. వీటి విలువ రూ.లక్షలు ఉండటంతో కొందరు వైసీపీ నాయకులు తమ అనుచరులు, పార్టీకోసం పనిచేసిన వారికి అప్పనంగా కట్టబెట్టారు. కుణుతూరు జగనన్న లేఅవుట్ వేసి పట్టాలు పంపిణీ చేశారు. ఇందుకుగాను కుణుతూరు పొలంలో సర్వేనెంబర్ 382-1, 387-1, 388-1, 389-1, 406-4బీలో స్థలాలు కేటాయించారు. ముందుగా ఈ లేఅవుట్‌లో అప్పటి ఎమ్మెల్యే చేతుల మీదుగా 30మందికి ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన పట్టాలను ఆ పంచాయతీ ప్రధాన వైసీపీ నాయకుల కనుసన్నల్లో పంపిణీ చేశారు. అయితే కొత్త ప్రభుత్వం రాగానే జగనన్న లేఅవుట్‌లోని అనర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించింది. ఈ లేఅవుట్‌లో అనర్హులకు పట్టాలు పంపిణీ చేశారని, 2021లో అదే గ్రామానికి చెందిన గొడ్డుమర్రి వెంకటేష్ లోకాయుక్తను ఆశ్రయించారు. వివాదం కోర్టులో ఉన్నప్పటికి హౌసింగ్ అధికారులు మాత్రం లబ్ధిదారులతో కుమ్మక్కై బిల్లులు కూడా మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

37మందికి నోటీసులు

కుణుతూరు జగనన్న లేఅవుట్‌లో 37మందిని మాత్రమే అనర్హులుగా గుర్తించారు. వారి పట్టాలు రద్దు చేసేందుకు ఆర్డీఓ కార్యాలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 30న విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. విచారణకు రాకపోతే పట్టాలు రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే పట్టాలు పొందిన వారిలో ఇంకా చాలామంది అనర్హులు ఉన్నారని, వారికెందుకు నోటీసులు ఇవ్వలేదని అదే గ్రామస్థులే అధికారులు వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా అధికారులు విచారణ చేసి అనర్హులను పూర్తిగా తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విచారణకు వస్తారా.. డుమ్మా కొడతారా?

అనర్హులుగా తేల్చిన 37మందిలో సుమారు 33మంది దాకా నోటీసులు తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వీరంతా విచారణకు హాజరవుతారా లేక డుమ్మా కొడతారా అనేది వేచిచూడాలి. నోటీసులు తీసుకున్న వారు 'మేము ఇళ్లు కట్టుకున్నాం. ఎవరేమి చేస్తారు? విచారణకు మా నాయకులు చెబితే పోతాం. లేదంటే లేదు. ఏమైనా చేయనిలే. మా ప్రభుత్వం మళ్లీ రాదా' అంటున్నట్లు సమాచారం. విచారణకు వెళ్లకపోతే పట్టాలు రద్దు చేస్తే ఎలా అంటూ మరికొంతమంది సందిగ్ధంలో పడ్డారు.




అనర్హుల ఇళ్లపట్టాలు రద్దుచేసేందుకు రెవెన్యూ అధికారులు జారీచేసిన నోటీసులు

నోటీసులు తీసుకునేందుకు వైసీపీ నాయకులు ససేమిరా..?

కుణుతూరు పంచాయతీలోని కుణుతూరు, కట్టకిందపల్లి, కామిరెడ్డిపల్లి గ్రామాలు వస్తాయి. ఈ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలే అప్పట్లో పట్టాలు పొందారు. కుణుతూరు, కామిరెడ్డిపల్లిలోని ఆగ్రామ వైసీపీ నాయకుల పేరు మీద పట్టాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి వారికి నోటీసులు జారీచేశారు. నోటీసులు తీసుకుని రెవెన్యూ అధికారులు ఆ నాయకుల ఇళ్ల వద్దకు వెళితే మీరు ఇచ్చే నోటీసులు తీసుకోం అనడంతో దిక్కుతోచక ఆ గ్రామస్థాయి సిబ్బంది వెనుతిరిగినట్లు సమాచారం. పొజిషన్ పట్టాలు పొందినట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయని చెప్పినా వినకుండా వెనక్కు పంపినట్లు సమాచారం.

పట్టాల రద్దుకు చర్యలు

ఇళ్ల పట్టాలు పొందిన వారిలో 37మందిని అనర్హులుగా గుర్తించి, నోటీసులు జారీచేశాం. వారిని ఈనెల 30న విచారణకు రావాలని నోటీసులో తెలిపాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హులు పట్టాలు తీసుకున్నట్లు తేలింది. వీరంతా ఆధారాలతో విచారణకు వచ్చి సంజాయిషీ ఇచ్చుకోవాలి. లేనిపక్షంలో వీరందరి ఇంటి పట్టాలు రద్దుకు తగు చర్యలు తీసుకుంటాం.



మహేష్, ఆర్డీఓ, ధర్మవరం

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణ స్వామి తెలిపారు. జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు చెట్ల కింద నిలబడరాదన్నారు. పశువులు, గొర్రెల మేకలను చెట్ల కింద ఉంచరాదని సూచించారు. ఉమ్మడి జిల్లాలో వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు రైతులు పాటించాలని సూచించారు. ప్రస్తుతం నమోదైన వర్షాలను వినియోగించుకుని వేసవి దుక్కులు చేసుకోవాన్నారు. వీటి వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు. పండ్ల తోటల్లో వేసవి కాలంలో గుంతలు తీసి ఎండనివ్వాలని సూచించారు. దీని వలన నేలలో ఉన్న పురుగులు, వాటి గుడ్లు, తెగుళ్లను కలిగించే శిలింధ్రాలు నశిస్తాయన్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రద్దీని నియంత్రించడానికి చర్లపల్లి-తిరుపతి మధ్య (వయా గుంతకల్లు) ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. చర్లపల్లి-తిరుపతి ప్రత్యేక వీక్లీ రైలు (నం.07257) మే 8వ తేదీ నుంచి వరుసగా నాలుగు గురువారాల్లో నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు చర్లపల్లిలో మే 8వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ గురువారాల్లో సాయంత్రం నాలుగున్నరకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07258) మే 9 నుంచి 30వతేదీ వరకూ వరుసగా నాలుగు శుక్రవారాల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున నాలుగున్నరకు చర్లపల్లికి చేరుతుందన్నారు. ఈ రైలు సనత్‌నగర్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

అమృత్ స్టేషన్ల తనిఖీ



కదిరి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని కదిరి, మదనపల్లి రోడ్, పీలేరు రైల్వే స్టేషన్లలో నిర్మాణ పనులను డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా మంగళవారం తనిఖీచేశారు. అమృత్ స్టేషన్ల కింద ఎంపికైన ఈ స్టేషన్లను డీఆర్‌ఎం సందర్శించి పనితీరును పరిశీలించారు. జరుగుతున్న పనులకు సంబంధించి బ్రాంచ్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్, మెకానికల్ ఇంజనీరింగ్ అధికారులు, రైల్వే స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలి

ఎన్‌ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు




రిలే దీక్షలు చేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రతనిచ్చే 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని ఎన్‌ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో అనంతపురం బస్టాండు ఆవరణలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న రిలే దీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది తప్పులు చేస్తే వారిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి 2019లో అప్పటి ఎండీ సురేంద్రబాబు అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి, 1/2019 సర్క్యులర్‌ను తీసుకొచ్చారన్నారు. పనిష్మెంట్ల విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలను సర్క్యులర్ ద్వారా అమలులోకి తెచ్చారని తెలిపారు. అయితే 2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యాక ఈ సర్క్యులర్‌ను పక్కన పెట్టేశారని తెలిపారు. దీంతో సిబ్బందిపై ఇష్టారాజ్యంగా చర్యలు తీసుకోసాగారన్నారు. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వడంతోపాటు గ్యారేజీల్లో ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జిల్లా నాయకుడు పుల్లయ్య, డిపో కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు రాము, రమణ, ఓబయ్య, కేజీ ప్రసాద్, హేమలత, అనసూయమ్మ, సర్వాణి తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,670 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 830 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

• బహుదూరపు బాటసారి..!



సాయంత్రం 6.26 గంటలకు ఎర్రటి బంతిలా మెరుస్తున్న సూర్యుడు

ఉదయ భానుడిగా
వెలుగులు పంచి...
మధ్యాహ్న మార్తాండుడిగా
ప్రకాశం అందించి...
సాయంకాల సమయాన
ప్రకృతి ప్రేమికులను
అలరిస్తూ
మరో తూరుపున ఉదయం కోసం
మా పడమటి కొండలు, తరువుల
మాటుకు వెళుతున్న సూరయ్యా..!
నీ ఒంటరి పయనం జగతికి ఆదర్శం

(ఈ చిత్రం చిలమత్తూరు మండలం దేమకేతిపల్లి సమీపంలో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కంటబడింది)

- ఆంధ్రజ్యోతి, హిందూపురం

మిర్చి వెలవెల..!

- పాతాళానికి ఎండుమిరప ధరలు
- కొనేవారు కరువు
- మార్కెట్‌యార్డు, పొలాల్లోనే దిగుబడులు
- అయోమయంలో అన్నదాతలు



మార్కెట్‌యార్డులో నిల్వచేసిన మిరప రాశులు

ఉరవకొండ, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి, లక్షలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు అన్నదాతల పాలిట కన్నీటి రాశులుగా మారుతున్నాయి. అన్నదాత కష్టానికి విలువ లేకుండా పోతోంది. ఎండు మిరప ధరలు అమాంతం పడిపోవడంతో కొనేవారులేక మార్కెట్‌యార్డు, పొలాల్లోనే రైతులు రాశులుగా పోసుకున్నారు. ఎక్కడ అమ్ముకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల నుంచి మిరప ధరలు దారుణంగా పడిపోయాయి. నియోజకవర్గంలో హెచ్చెల్సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువతోపాటు, బోరుబావుల కింద 20వేల ఎకరాలకుపైగా మిర్చి సాగుచేశారు. జిల్లావ్యాప్తంగా 45 వేల ఎకరాల్లో మిరప పంట పెట్టారు. వీటిలో బ్యాడిగ, డబ్బీ, 2043, తేజ, 5531 రకాలను వేశారు. ఎకరాకు రూ.2 లక్షలదాకా పెట్టుబడులు పెట్టారు. బ్యాడిగ, డబ్బీ రకాలు క్వింటా ధర ఫిబ్రవరిదాకా రూ.38 వేలు పలికాయి. ప్రస్తుతం రూ.20 వేలకు పడిపోయింది. ఈసారి జిల్లావ్యాప్తంగా సుమారు 7 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గతేడాది లక్షల క్వింటాళ్లదాకా స్టోరేజీల్లో నిల్వలున్నాయి. విత్తన రకాల మిరప పంట ధరలు రూ.8 వేలు దాటడం లేదు. ఉన్న రేటుకే అమ్ముదామంటే కొనేవారే కరువయ్యారని రైతులు వాపోతున్నారు. మిరప కోతలు పూర్తయి నెలరోజులైంది. వాటిని నిల్వ చేసుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. దీంతో పొలాల్లోనే, చెట్ల కిందే నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరికొంతమంది రైతులు కర్ణాటకలోని బ్యాడిగ, ఇతర ప్రాంతాల్లోని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. బస్తాకు రూ.150దాకా రవాణా, నిల్వ చేసినందుకు రూ.250 అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఇది రైతులకు అదనపు భారం కానుంది.

ఫిబ్రవరి దాకా బాగున్నా..

ఫిబ్రవరి దాకా డబ్బీ, కడ్డీ రకం మిరప ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. పంట చేతికి రాగానే అమాంతం పడిపోయాయి. దీంతో ఈసారీ మిర్చి రైతుకు నష్టాలు తప్పలేదు. స్థానికంగా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

గత మూడేళ్లలో మిరప ధరలు ఇలా..

రకం	2023	2024	2025
కడ్డీ	రూ.60-65వేలు	రూ.50-55వేలు	రూ.14-20వేలు
డబ్బీ	రూ.65-70వేలు	రూ.45-50వేలు	రూ.20వేలు
5531	రూ.20-25వేలు	రూ.20-25వేలు	రూ.8-10వేలు
2043	రూ.30-40వేలు	రూ.30-40వేలు	రూ.5-8వేలు

నష్టానికే అమ్ముకోవాల్సి వస్తోంది



రెండేళ్లుగా మిరప ధరలు పడిపోయాయి. నష్టానికే అమ్ముకోవాల్సి వస్తోంది. మూడు ఎకరాల్లో పంట సాగు చేశా. 16 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రూ.12వేలకు కూడా డబ్బీరకం మిరప అడిగేవారు లేరు. స్థానికంగా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

- భీమప్ప, రైతు, ఉరవకొండ

కొనేవారే లేరు



మూడెకరాల్లో మిరప సాగుచేశా. వర్షానికి తెగుళ్లు సోకి పంట దిగుబడి తగ్గిపోయింది. 7 క్వింటాళ్లే వచ్చింది. అదికాస్త అమ్ముదామనుకుంటే కొనేవారు లేరు. గత్యంతరంలేక మార్కెట్లో రూ.18 వేలకే క్వింటా చొప్పున అమ్మేశా.

- వెంకోబరావు, రైతు, ఉరవకొండ

అమరావతి కేంద్రంగా ఏపీజీబీ

నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనం పూర్తి

రేపటి నుంచి అమలు: ఆర్‌ఎం శ్రీదేవి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి కేంద్రంగా ఏపీజీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు) ప్రధాన కార్యాలయం పనిచేస్తుందని ఆ బ్యాంకు ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు. నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనానికి సంబంధించి మంగళవారం స్థానిక అంబేడ్కర్‌రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులు నాలుగింటిని కలిపి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారని తెలిపారు. మొత్తం 1351బ్రాంచ్‌లు, 7వేల మంది ఉద్యోగులు, రూ.1.23లక్షల కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా అవతరించిందన్నారు. నాలుగు బ్యాంకుల విలీనంతో ఖాతాదారులకు ఎటువంటి నష్టం ఉండదని, ఖాతా నంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్రాంచ్ చిరునామాలలో ఎటువంటి మార్పులు ఉండవని తెలిపారు. బ్యాంకు విలీనంతో ఖాతాదారులకు మరింత మెరుగైన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు చేరువచేస్తామన్నారు. మే 1వతేదీ నుంచి బ్యాంకుల విలీనం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్లు చైతన్యకుమార్, శ్రీధర్, శివకుమార్, శేషసాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీదేవి

జేఎన్టీయూ స్నాతకోత్సవానికి గవర్నర్: వీసీ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరు కానున్నట్లు వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. జేఎన్టీయూలో ఈసెట్-2025 నిర్వహణపై మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. మే 17న స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 7వేల మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తామన్నారు. గవర్నర్‌తో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

పరీక్షలు రాయనున్న 14,221 మంది విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకోసం బుధవారం నిర్వహిస్తున్న పాలిసెట్‌కు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను సంబంధిత అధికారులు పూర్తిచేశారు. కోఆర్డినేటర్లు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు పరీక్షా కేంద్రాలను సందర్శించి, అధికారులను సమన్వయం చేశారు. వారు మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు పరీక్షలు ప్రారంభమౌతాయన్నారు. 10 గంటలనుంచే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. రవాణా సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని 9గంటలకే పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాల్లో 14,221మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన రెండు కేంద్రాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు

తాడిపత్రి, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగనూరు సమీపాన మంగళవారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో నరసింహులు (59) మృతిచెందగా.. అతడి భార్య వరలక్ష్మి గాయపడ్డారు. రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన నరసింహులు, అతడి భార్య వరలక్ష్మి బైక్‌లో కడపజిల్లా కొండాపురం మండలానికి బయల్దేరారు. వంగనూరు సమీపంలో లారీ ఢీకొట్టడంతో నరసింహులు, వరలక్ష్మికి గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. నరసింహులు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వరలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీపీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) పరీక్షా ఫలితాలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత విడుదల చేశారు. వీసీ మాట్లాడుతూ.. ద్వితీయ సెమిస్టర్ పరీక్షలకు 74మంది హాజరుకాగా.. 47మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్, న్యాయవిద్య విభాగాధిపతి డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

రేపట్నుంచి వేసవి శిబిరాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడాశిక్షణా శిబిరాలు మే ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆయా వేదికల వివరాలను ఆయన వెల్లడించారు. వివరాలకు 9849421462 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్రీడాంశం	శిబిరం నిర్వహించే వేదికలు
అథ్లెటిక్స్	అనంతపురం, పామిడి, గుంతకల్లు
ఆర్చరీ	విద్యారణ్య స్కూల్, ఆన్‌సెట్ ఆఫీస్
బాస్కెట్‌బాల్	డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియం, నీలం సంజీవరెడ్డి స్టేడియం, ఉరవకొండ
ఫుట్‌బాల్	అనంతపురం ఆర్ట్స్ కాలేజీ
ఫెన్సింగ్	కళ్యాణదుర్గం, సేతు స్కూల్, ఇండోర్ స్టేడియం, విద్యారణ్య స్కూల్ (అనంతపురం),
హ్యాండ్‌బాల్	కళ్యాణదుర్గం కేవీకే, చాపిరి
హాకీ	కళ్యాణదుర్గం, అనంతపురం ఆర్ట్స్ కాలేజీ
జూడో	అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, గార్లదిన్నె, తాడిపత్రి
కబడ్డీ	నీలం సంజీవరెడ్డి స్టేడియం, ఎస్ఎస్‌బీఎన్, తాడిపత్రి, యాడికి, గుంతకల్లు
కర్రసాము	ఆర్ట్స్ కళాశాల
ఖో-ఖో	రాప్తాడు, రాయదుర్గం,
సెపక్‌తక్రా	ఉరవకొండ
స్విమ్మింగ్	అనంతపురం
టేబుల్ టెన్నిస్	ఉరవకొండ
తైక్వాండో	పామిడి, రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కు, నీరుప్రగతి పార్కు, వివేకానంద పార్కు, ఎంటీ తైక్వాండో అకాడమీ, లక్ష్మిస్కూల్, రెయిన్‌బో స్కూల్
వాలీబాల్	నీలం సంజీవరెడ్డి స్టేడియం, ఉరవకొండ, తాటిచెర్ల, శింగనమల తరిమెల, నార్ప
రైఫిల్ షూటింగ్	విద్యారణ్య స్కూల్
రెజ్లింగ్	పామిడి, కళ్యాణదుర్గం
బ్యాడ్మింటన్	అనంతపురం
వెయిట్‌లిఫ్టింగ్	తాటిచెర్ల

ట్యాంకర్ డ్రైవర్ ఆత్మహత్య

హిందూపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూమకుంట చెక్‌పోస్టుకు చెందిన ట్యాంకర్ డ్రైవర్ రాజు(40) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ ఎస్ఐ మునిప్రతాప్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి రాజు, అతడి భార్య నిర్మల, పిల్లలు కలిసి మేడపై పడుకున్నారు. వర్షం కురవడంతో భార్యాపిల్లలు ఇంట్లోకి వెళ్లిపోయారు. అక్కడే పడుకున్న రాజు అర్ధరాత్రి దాటాక సిమెంటు దిమ్మెకు ఉన్న ఇనుపకడ్డీలకు లుంగీతో ఉరేసుకున్నాడు. ఉదయం రాజు ఎంతసేపటికీ కిందకు రాకపోవడంతో భార్యాపిల్లలు వెళ్లిచూశారు. సిమెంటు దిమ్మెకు వేలాడుతూ కనిపించాడు. కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. అప్‌గ్రేడ్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. కొంతకాలంగా రాజు వ్యసనాలకు బానిసయ్యాడని పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలు కూడా ఉన్నట్లు భావిస్తున్నారు. ఆత్మహత్యపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్..

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండిగానిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ యల్లప్ప (40) అప్పుల బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. యల్లప్ప కుటుంబ ఖర్చులకు బయట అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. ఈ నేపథ్యంలో తన ఇంటిలోనే ఉరేసుకుని, మరణించినట్లు పోలీసులు, బంధువులు తెలిపారు. యల్లప్పకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కౌలురైతు...



తలారి జయరాములు (ఫైల్)

బెళుగుప్ప, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగవరంలో కౌలు రైతు తలారి జయరాములు(54) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. పదేళ్ల నుంచి మామిడితోటలను కౌలుకు తీసుకుని జీవనోపాధి పొందేవాడు. ఈ యేడాది 12 ఎకరాలను కౌలుకు తీసుకోగా, ఆశించినంత దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.10 లక్షలకుపైగా పేరుకుపోయాయి. దిక్కుతోచనిస్థితిలో తోటలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందకనే ప్రాణాలు కోల్పోయాడు. జయరాములకు భార్య శారద, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీవీ మెకానిక్ మృతి

శింగనమల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.బండమీదపల్లి వద్ద బైక్‌ను వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వెళ్లిపోయిన ప్రమాదంలో టీవీ మెకానిక్ వెంకట్రామిరెడ్డి(44) మృతిచెందాడు. ఎస్ఐ విజయ్‌కూమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపప్పూరుకు చెందిన వెంకట్రామిరెడ్డి కుమారుడు బుక్కరాయసముద్రం మండలంలోని ఎస్ఆర్ఐటీ కాలేజ్ పక్కనున్న అనాథాశ్రమంలో పనిచేస్తున్నాడు. కుమారుడిని చూడడానికి వెంకట్రామిరెడ్డి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. సీ.బండమీదపల్లి సమీపాన వెంకట్రామిరెడ్డి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన వెంకట్రామిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య ఇద్దరు కూమారులు ఉన్నారు. శింగనమల ఎస్ఐ విజయ్‌కూమార్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురంటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామని రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి ఆనంద్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఈప్రతిభా పురస్కారాల విషయంగా మంగళవారం సమావేశమై చర్చించారు. వారు మాట్లాడుతూ పదో తరగతిలో 450కి పైగా, ఇంటర్‌లో 650కిపైగా మార్కులు సాధించిన రజక విద్యార్థులు ఈపురస్కారాలకు అర్హులన్నారు. బయోడేటా, మార్కులజాబితాను దరఖాస్తుకు జతపరిచి మే 20లోపు టీచర్ ఎర్రిస్వామి, డోర్‌నెంబర్ 1-1284, ఆర్‌కేనగర్, అనంతపురం చిరునామాకు పంపాలన్నారు. పురస్కారాల పంపిణీకి రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రమ్మ, డైరెక్టర్లు పరమేశ్వర్, రామాంజినేయులు అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గోపాల్, రామచంద్ర, రాజశేఖర్, రామయ్య, నాగేంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థికి డీఈఓ అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వశిష్ఠి పాఠశాల విద్యార్థి గౌతమ్‌కుమార్‌రెడ్డి పది ఫలితాల్లో 600లకు గాను 597 మార్కులు సాధించాడు. రాష్ట్రంలో నాలుగో, జిల్లాలో రెండో స్థానంలో నిలిచాడు. ఆ విద్యార్థిని డీఈఓ క్రిష్టప్ప మంగళవారం అభినందించి.. సన్మానించారు. ఆయన వెంట పాఠశాల కరస్పాండెంట్ పిట్టా శివశంకర్‌రెడ్డి ఉన్నారు.

నేను టీడీపీనే : నర్మదా రెడ్డి

కొత్తచెరువు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): 'నేను టీడీపీలోనే ఉంటూ పార్టీ గెలుపు కోసం పనిచేశాను. కొంతమంది వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చినవారు నన్ను వైసీపీ మహిళ అని.. పుట్టపర్తి మండల వాసినని అసత్య ప్రచారం చేస్తున్నారు..' అని ఐకేపీ మండల సమాఖ్య అధ్యక్షురాలు నర్మదారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. తనను మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి స్వయంగా మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎంపిక చేశారని పేర్కొన్నారు. కొంతమంది తన ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇలాంటి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. తాను కొత్తచెరువు మండలవాసినేనని, తనకు తన స్వగ్రామం బంగారు చెన్నేపల్లిలో బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, భూములు ఉన్నాయని అన్నారు.

పౌరుహక్కులపై అవగాహన

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర ఓబునపల్లిలో మంగళవారం పౌరుహక్కు దినోత్సవాన్ని అంబేడ్కర్ కాలనీలో నిర్వహించారు. తహసీల్దార్ అనంతచారి ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక చట్టాలు, హక్కుల గురించి వివరించారు. అనంతరం కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, వీఆర్‌ఓ బాలకృష్ణ, హాస్టల్ వార్డెన్ రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● నల్లమాడ : మండలంలోని పులగంపల్లి ఆర్డీటీ కార్యాలయంలో పౌరుహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని తహసీల్దార్ రంగనాయకులు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలు హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి మస్తాన్, డీవీఎంసీ సభ్యులు వీరనారాయణ, న్యాయవాది రామాంజనేయులు, ఎస్సీ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా గంగిరెడ్డి



కదిరిలీగల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా న్యాయవాది గజ్జల గంగిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించి పంపడంతో ఆయన నియామకం ఖరారైంది. గాండ్లపెంట మండలం బొల్లిగుట్లపల్లికి చెందిన ఈయన అనంతపురం విజయనగర్ లా కాలేజ్ నుంచి లా పట్టా పుచ్చుకున్న ఆయన 2016 నుంచి కదిరిలో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఐదు సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న .. లేకున్నా కందికుంట వెంకటప్రసాద్‌కు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తూ వచ్చారు.

చిరుత సంచారం.. అవాస్తవం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేనిపల్లి గ్రామ పొలాల్లో చిరుత సంచరిస్తోందని, చిరుత దాడిలో కుక్క చనిపోయిందని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. మంగళవారం ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ అక్కులప్ప మల్లేనిపల్లి గ్రామపొలాల్లో పరిశీలించారు. ఎక్కడా చిరుత తిరిగినట్లు ఆనవాళ్లు లేకపోవడంతో చిరుత సంచారం అవాస్తమని తేల్చిచెప్పారు. పొలాల్లో ఎక్కడా చిరుతపులి అడుగులు లేవని, చిరుతదాడిలో కుక్క చనిపోయిందని అవాస్తమని తెల్చారు. దీనిపై మల్లేనిపల్లి గ్రామస్థులు ఎవరూ ఆందోళన, భయాపడాల్సిన అవసరం లేదన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులచెరువు వీఆర్‌ఏ నీరుగంటి పోతలయ్య (56) అనారోగ్యంతో మరణించాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతన్ని కుటుంబసభ్యులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి సోమవారం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. మంగళవారం విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, వీఆర్‌ఓలు మధుసూదన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలకు రూ.25వేలు నగదును మృతుని భార్య ఆదెమ్మకు అందించారు.

భాగపరిష్కారాలు చేసుకోండి

బత్తలపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జాయింట్ పట్టాదారులు ఉన్న రైతులు భాగపరిష్కారాలు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలోని దంపెట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో రీసర్వే జరుగుతోందన్నారు. గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా ఉన్న వారు సచివాలయంలోని రీసర్వే సిబ్బందిని కలసి సింగల్ ఎల్‌పీఎం చేసుకోవాలని కోరారు. చేయించుకపోతే జాయింట్ పట్టాదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తించవని తెలిపారు.

వివాహానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

నంబులపూలకుంట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ నగర్‌లో నివాసముంటున్న చిన్నపెద్దన్న, అంజనమ్మ వారి కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను ఆర్థికసాయం అర్థించారు. దీంతో ఎమ్మెల్యే వారికి రూ.10 వేలు అందజేసినట్లు టీడీపీ నాయకులు రమేష్‌కుమార్, గంగాద్రి మంగళవారం తెలిపారు.

పౌష్టికాహారంపై అవగాహన

కదిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తలుపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు కదిరి ప్రాజెక్టు సీడీపీఓ రాధిక మంగళవారం అవగాహన కల్పించారు. ఏడో పక్షోత్సవ పోషణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఎంపీడీఓ రామానాయక్, సూపర్‌వైజర్లు దీప, అలివేలమ్మ పాల్గొన్నారు.

భార్య హత్యకేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

పావగడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్షను కోర్టు విధించింది. వెంకటాపురం గ్రామానికి చెందిన బాలాజీ వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని భార్య కవిత మందలించడంతో వారి మధ్య ఘర్షణ సాగింది. అనంతరం 2019లో మార్చి 23న పావగడ కోర్టుకు కవిత నడిచి వస్తుండగా ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ ముందు బాలాజీ కొడవలితో అతికిరాతకంగా నరికి చంపాడని కవిత సోదరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ వెంకటేశ్ కేసు నమోదుచేసి నాలుగవ అడిషనల్ కోర్టుకు అందించగా వాదోపవాదాలను పరిశీలించిన న్యాయాధికారి బాలాజీకి యావజ్జీవ శిక్షను విధిస్తూ తీర్పు విధించారు.

వడ్డీరాయితీకి నేడు ఆఖరు

పెనుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో బకాయిపడ్డ ఇంటి, ఖాళీజాగా, ఇతరత్ర పన్నులు చెల్లించి వడ్డీరాయితీ పొందడానికి బుధవారం ఆఖరిరోజని కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. 2024-25సంవత్సరానికి సంబంధించి బకాయిపడ్డ పన్నులను ఏకమొత్తంలో ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 50శాతం రాయితీ ఉంటుందన్నారు.

అక్రమ కట్టడాలపై అట్టుడికిన కౌన్సిల్

కమిషనర్‌తో కౌన్సిలర్ల వాగ్వాదం

కదిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ కట్టడాలపై పలువురు కౌన్సిలర్లు టౌన్‌ప్లానింగ్, కమిషనర్‌ను నిలదీశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్యానల్ చైర్‌పర్సన్ హరిణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలోని కొన్ని అంశాలు తప్ప మిగిలిన అంశాలు ఆమోదించారు. అనంతరం 0 సమయంలో పలువురు కౌన్సిలర్లు సమస్యలను విన్నవించారు. 24వార్డులో మున్సిపల్ స్థలాన్ని అక్రమించుకుని అక్రమ నిర్మాణం చేస్తుంటే అధికారులు నిద్రపోతున్నారా అని ఆ వార్డు సభ్యుడు ముస్తఫా అధికారులను ప్రశ్నించారు. మూడంతస్తుల భవనం కట్టెంతవరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ విషయంలో ముస్తఫా, కమిషనర్ మధ్య వాగ్వివాదం జరిగింది. కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే నోటీలిచ్చామని, అక్రమ నిర్మాణం అయితే ఆపివేస్తామని అన్నారు. నాల్లో వార్డు సభ్యుడు కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఆర్‌టీ క్లబ్‌కు మున్సిపల్ నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. అయితే దీనికి పలువురు సభ్యులు అభ్యంతరం చెప్పారు. ఎంతోమంది విద్యార్థులను వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నారని, దీనికి నిధులు కేటాయించాలని మెజార్టీ సభ్యులు చెప్పడంతో దానికి ఆమోదం తెలిపారు. 31వార్డు సభ్యురాలు బీబీజాన్ మాట్లాడుతూ తమ వార్డులో మురుగునీరు, చెత్త సమస్యలున్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు, ప్యానల్ చైర్‌పర్సన్ హరిణి

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల రిలేదీక్షలు



ధర్మవరం, కదిరిలో రిలేదీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోయేషన్ సభ్యులు చేపట్టిన రిలే దీక్ష రెండో రోజైన మంగళవారమూ కొనసాగింది. ఇందులో ఈ నిరాహారదీక్షలో డిపో చైర్మన్ హనుమాన్, డిపో ప్రెసిడెంట్ ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎం రత్నం, సీనియర్ నాయకుడు నారాయణ స్వామి పాల్గొన్నారు.

● కదిరి అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్ష కొనసాగింది. ఇందులో ఎన్ఎంయూఏ నాయకులు ఎన్‌వీ రమణ, శ్రీనివాసులు, జిలాన్, లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం, రాజ్‌కుమార్, బైరశెట్టి, నారాయణస్వామి, పులి శ్రీనివాసులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు భేష్ : ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది సమష్టిగా పనిచేయడం వల్లే జిల్లా పోలీసుశాఖకు రాష్ట్ర స్థాయి ఏబీసీడీ అవార్డు దక్కిందని ఎస్పీ వీ.రత్న పేర్కొన్నారు. మడకశిరా తాలూకా గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామంలో 26 సంవత్సరాల క్రితం జరిగిన హత్యకేసును ఛేదించిన జిల్లా పోలీసులకు డీజీపీ ఇటీవల మంగళగిరిలో అవార్డును అందచేశారు. ఆ అవార్డు అందుకున్న సిబ్బందిని ఎస్పీ జిల్లాపోలీసు కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. సన్మానం పొందిన వారిలో సీఐ రాజ్‌కుమార్, ఎస్పీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఎస్ఐలు మునిప్రతాప్, శ్రీరాములు, సిబ్బంది మల్లికార్జున, పోతన్న, మహమ్మద్‌రఫీ, మంజునాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, నరేష్ ఉన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, హేమంత్‌కుమార్, శివనారాయణస్వామి, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐలు వలి, మహేష్ పాల్గొన్నారు.



అవార్డు పొందిన పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ

కొనసాగిన సీహెచ్‌ఓల నిరవధిక సమ్మె


మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని వైద్యఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ కింద విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌ఓలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజైన మంగళవారమూ కొనసాగింది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన సీహెచ్‌ఓలు ఇందులో పాల్గొన్నారు. మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నందీశ్వర్‌రెడ్డి, చందన, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలి: జేసీ


మాట్లాడుతున్న జేసీ

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేను ఎటువంటి తప్పుల్లేకుండా.. పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశభవనంలో రెవెన్యూ సిబ్బందికి రీసర్వేపై శిక్షణ, సమీక్ష నిర్వహించారు. రీసర్వేలో తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. రీసర్వేను విజయవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, డీఏఓ ఖతిజున్‌ఖుబ్రా, తహసీల్దార్ నటరాజ, డివిజన్‌లోని తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వే అధికారులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

● ఈవీఎం గోడౌన్‌ను పరిశీలన

పట్టణంలోని మార్కెట్‌యార్డులోని ఈవీఎం గోడౌన్‌కు జేసీ అభిషేక్‌కుమార్ పరిశీలించారు. మరింత భద్రత కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రేషన్‌బియ్యం స్టాకు పాయింట్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీఓ మహేష్, రాజకీయపార్టీ ప్రతినిధులు ఉన్నారు.

2 నుంచి కావమ్మ, మారెయ్య తిరునాళ్ల


కావమ్మ, మారెయ్య

నంబులపూలకుంట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలోని కొత్తరోడ్డు వద్ద ఉన్న కావమ్మ మారయ్య ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శ్రీధర్ తెలిపారు. శుక్రవారం గ్రామ దేవత ఊరేగింపు, అదే రోజు రాత్రి కావమ్మ జీవిత చరిత్ర జంగాల కథ, శనివారం కావమ్మ, మారెయ్యల కళ్యాణం, అనంతరం ఊరేగింపు, అమ్మవారికి సార సమర్పించడం, ఆదివారం అభిషేకాలు, పూజ కార్యక్రమాలు, రాత్రి మంచినీటి జ్యోతితో రాత్రి అంతా అగ్ని గుండం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం తెల్లవారు జామున భక్తులు అగ్ని గుండ ప్రవేశం ఉంటుందన్నారు. అగ్నిగుండంలో ప్రవేశించే భక్తులు కంకణం ధరించాలన్నారు.

రాజ్యసభ సీటు కేటాయింపుపై హర్షం

కదిరి అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రాజ్య సభ సీటును ఎన్డీఓ కుటమి తరపున బీజేపీ అభ్యర్థి పాక వెంకటసత్యనారాయణకు కేటాయించడంపై కిస్తాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీవై అధ్యక్షుడికి ఘనస్వాగతం

బత్తలపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బీసీవై వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్‌కు టీడీపీ రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గంటాపురం జగ్గు ఘన స్వాగతం పలికారు. మంగళవారం రామచంద్ర యాదవ్ తాడిపత్రికి వెళ్తుండగా.. మార్గమధ్యలోని బత్తలపల్లిలో ఆయన్ను కలిశారు. ఈ కార్యక్రమంలో సునీల్ యాదవ్, సాంబ పాల్గొన్నారు.


రామచంద్రకు స్వాగతం పలుకుతున్న జగ్గు


నిత్యావసర వస్తువులు, మందులు పంపిణీ చేస్తున్న ఫకృద్దీన్

నిత్యావసరాల పంపిణీ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 40 మంది ముస్లిం మైనార్టీ పిల్లలకు ఉచితంగా కత్నా (వడుగులు) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆ పిల్లలకు విజ్ఞాన్ విద్యా సంస్థ చైర్మన్ మార్గానికుంట్ల ఫకృద్దీన్ రూ. 40 వేల విలువైన మందులు, చిత్యావసర వస్తువులను అందజేశారు. కత్నా చేసిన కొండకమర్లకు చెందిన వైద్యుడు ఖాజాను నాయకులు సాధిక్‌వలీ, అబ్దుల్ హుస్సేన్, నిజాం, ఆర్ఫి, షానూ సన్మానించారు.

నేడు పాలిసెట్

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం బుధవారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. పట్టణంలోని తారకరామపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, కొత్తపేటలోని మున్సిపల్ బాలికల పాఠశాల, సాయిబాబా గుడి వద్ద శ్రీనివాస డిగ్రీకళాశాల కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని, విద్యార్థులు ఉదయం 10గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు.

ఆర్డీటీ మనుగడపై 2న రౌండ్‌టేబుల్ సమావేశం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు జిల్లాల్లో ప్రజా సేవ కార్యక్రమాలను చేస్తున్న ఆర్డీటీ సంస్థ మనుగడపై రాజకీయాలకు అతీతంగా శుక్రవారం పట్టణంలోని ఎన్‌జీఓ హోం నందు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కులసంఘాలు అందరూ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

తనకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని మంగళవారం గ్రంథాలయ అధికారి మస్తాన్ వలీ ప్రారంభించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కదిరిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయండి

కదిరి అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కదిరిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్‌ను విజ్ఞప్తి చేసినట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బైరవప్రసాద్ తెలిపారు. మంగళవారం మంగళగిరిలో మంత్రిని కలిసినట్లు చెప్పారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, యోగివేమన సమాధి, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను ఉన్నాయని వివరించినట్లు చెప్పారు. తన వెంట పార్టీ నాయకులు జయవర్ధన్, రవికుమార్, ఆంజిబాబు ఉన్నారన్నారు.


మంత్రిని కలిసిన జనసేన భైరవప్రసాద్


క్లబ్ మిత్రులను సన్మానిస్తున్న డీపీఓ

క్లబ్ మిత్రులకు సన్మానం

బుక్కపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా సిద్దరామపురం గ్రామ పంచాయతీ జిల్లాలో మొదటి స్థానం సాధించింది. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న జిల్లా అధికారులు ఈ విషయాన్ని ప్రకటించారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి సమత మంగళవారం సిద్దరామపురానికి వెళ్లి .. ఈ ఘనతకు కారణమైన క్లబ్ మిత్రులు నరసింహులు, రాములమ్మ, రామాంజినమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీపై ఆంక్షలు సడలించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘం నాయకులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలకు అడ్డుకునేలా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఆంక్షలను సడలించేలా చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సేవా సమితి, బహుజన ప్రజా పరిరక్షణ సేవా సమితి నాయకులు కోరారు. మంగళవారం స్థానిక వికలాంగుల భవనంలో వారు మాట్లాడుతూ.. ఆర్డీటీ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పేదలకు అండగా నిలుస్తోందన్నారు. అలాంటి సంస్థకు విదేశాల నుంచి వచ్చే నిధులు అందుకుండా కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధుల, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్జీలు, విద్యాసంఘాలు ముందుకొచ్చి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరిప్రసాద్, జాకీర్ హుస్సేన్, వేణుగోపాల్, మునికుమార్, సూర్యనారాయణ, దిల్‌షాద్, శ్రావణి, బాలరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్


సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ తాయన్న

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మ్యానువల్ పద్ధతి ప్రకారం కాకుండా గురువారం నుంచి స్లాట్‌బుకింగ్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు సబ్‌రిజిస్ట్రార్ తాయన్న తెలిపారు. మంగళవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌పై దస్తావేజులేఖరులతో ఆయన సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్‌బుకింగ్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఉంటుందన్నారు. కావున ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆయన తెలిపారు. స్లాట్ బుకింగ్ ద్వారానే సేవలు అందుతాయన్నారు.

బిల్లుల్లో భారీ అవకతవకలు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుక్కపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యగారిపల్లి పంచాయతీ పరిధిలోని ఇంటి పన్ను వసూళ్లు, కొళాయి కనెక్షన్ విషయంలో భారీగా అవకతవకలు జరిగాయని టీడీపీ సీనియర్ నాయకులు సురేంద్ర, బోయగడ్డ జయరాం ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం పంచాయతీ ఇన్‌చార్జికార్యదర్శి సాదిక్ బాషాకు వినతిపత్రం అందించారు. 2021 నుంచి 2025 వరకు పంచాయతీ నిధులు గోల్‌మాల్ జరిగాయని, పంచాయతీ పరిధిలో ఇంటిపన్నుల వసూలు, కొళాయి కనెక్షన్ల వివరాలు, చలానా వివరాలు ఇవ్వాలని కోరారు.

బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వం బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్డీఓ మహేష్‌కు వినతి పత్రం ఇచ్చిన వారు మాట్లాడారు. ధర్మవరంలో చాలామంది పేదలు తలసేమియా, తదితర రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి రక్తం కావాలంటే అనంతపురం, తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. ప్రభుత్వం స్పందించి బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని, లేకుంటే అన్ని విద్యార్థి యువజన రాజకీయ కార్మిక చేనేత అఖిలపక్ష ప్రజలతో ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్ ఆదినారాయణ, అనిల్, అమన్, హరి పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

తనకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరాకువాండ్లపల్లిలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ శ్రీరాము మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. నేరాలపై ఆరా తీశారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా తనకల్లు ఉండడంతో.. సరిహద్దులో నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బెల్లం సరఫరా చేసేవారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

న్యూస్ బాక్స్

విజయవంతం చేయండి

గోరంట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని మండలశాఖ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉద్యమ కార్యాచరణ మేరకు మే 5న పాత తాలూకాల కేంద్రాల్లోనూ, మే 9న కలెక్టర్ కార్యాలయాల ఎదుట, 14న విజయవాడలో ధర్నానిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆందోళనకు ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సిరాజుద్దీన్, ఈశ్వర్ ప్రసాద్, వెంకటనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, ఆదినారాయణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోరంట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ అంతరాయం ఉన్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలక్రిష్ణనాయక్ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ అంతరాయముంటుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిచెరువుపల్లి, బూదిలి, నారసింహపల్లి, పంచాయతీల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లిలో గ్రామస్థులు ఘనంగా ముత్యాలమ్మ, సుంకలమ్మ జాతర మహోత్సవం నిర్వహించారు. ప్రతి యేటా ఆనవాయితీ ప్రకారం గ్రామంలోని ఆంజనేయస్వామికి జ్యోతులు మోశారు. మంగళవారం గ్రామదేవత అయిన ముత్యాలమ్మ, సుంకలమ్మ, పెద్దమ్మలకు బోనాలు సమర్పించి జ్యోతులు సమర్పించారు. జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సడ్లపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రిటైర్డ్ ఉపాధ్యాయురాలు శైలజదేవి రూ.50వేలు నగదును విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

వడ్డీరాయితీకి నేడు ఆఖరు

పెనుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో బకాయిపడ్డ ఇంటి, ఖాళీజాగా, ఇతరత్ర పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందడానికి బుధవారం ఆఖరిరోజని కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. 2024-25సంవత్సరానికి సంబంధించి బకాయిపడ్డ పన్నులను ఏకమొత్తంలో ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 50శాతం రాయితీ ఉంటుందన్నారు. 2025-26సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్నులు ఏకమొత్తంలో చెల్లించినవారికి ఐదుశాతం వడ్డీలో రాయితీ ఉంటుందన్నారు. పన్నులు చెల్లించి రాయితీ పొందడానికి బుధవారం సాయంత్రం 5గంటలతో సమయం ముగుస్తుందన్నారు.

పోషకాహారంపై అవగాహన

పరిగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, చిన్నపిల్లలు పోషకాహార లోపాలపై అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలకు బుధవారం సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో పరిగి ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార లోపాన్ని ఎదుర్కొనడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం తదితర వాటిపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. కమ్యూనిటీబేస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ మాల్ న్యూట్రిషన్ ద్వారా పోషకాహారలోపాలను తగ్గించి పోషణ్‌ట్రాకర్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశ్వర్థప్ప, ఎంఈఓ శేషాచలం, హెచ్ఎం కృపాసత్యరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నందిత పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం: సీడీపీఓ

పెనుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేద్దామని సీడీపీఓ శాంతలక్ష్మీ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం, పోషక బట్వాడా కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషక బట్వాడా కార్యక్రమంలో పిల్లలకు ఆహారంలో వైవిధ్యం, పుట్టిన బిడ్డకు తల్లిపాలే పట్టాలన్నారు. గర్భవతులు ప్రశాంతమైన వాతావరణంలో గడపాలన్నారు. మే2నుంచి జూన్ 10వరకు కిశ్శర వికాస్ కార్యక్రమాలను, ప్రతి గ్రామంలో కచ్చితంగా జరపాలన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఇతరశాఖ అధికారులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎంపీడీఓ భాగ్యరేఖ, మెడికల్ ఆఫీసర్ గంగాధర్‌నాయక్, మెప్మా ఏపీఎం సాదిక, మురళి, సూపర్‌వైజర్లు పుష్పలత, యర్రమ్మ, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, యానిమేటర్లు, ఆర్పీఎలు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అగళి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అగళి మండల పరిషత్ ఏఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం మండలానికి 26యూనిట్లు మంజూరు చేసిందన్నారు. ఆసక్తిగల యువత మే 10వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హతను బట్టి ఎంపిక చేయడం జరుగుతుందని ఏఓ తెలిపారు.

ఐటీఐకి...

హిందూపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చేనెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవచ్చన్నారు. దరఖాస్తుచేసుకునే విద్యార్థులు శ్రీకంఠపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఒరిజినల్ పత్రాలు సమర్పించి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఐటీఐలో కోర్సు పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9440258629నంబరుకు సంప్రదించాలన్నారు.

బావికి రక్షణ గోడ ఏర్పాటు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాత 44వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఊటబావికి ఎట్టకేలకు అధికారులు స్పందించి కల్వర్టు (రక్షణగోడ) ఏర్పాటు చేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతి బావి భయం అన్న కథనానికి స్పందించిన అధికారులు కల్వర్టును ఏర్పాటు చేశారు. ఈబావి పెనుకొండ-అనంతపురం రహదారికి ఆనుకుని సోలార్ పరిశ్రమ ముందు ఉంది. రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉండటంతో రక్షణ గోడను నిర్మిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బావికి రక్షణ గోడను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

విధుల్లోనే కాదు.. సేవలోనూ భేష్.!

సామగ్రి ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా హిందీ బోధన

మొక్కల పెంపకం, బాల్యవివాహాలపై కార్యక్రమాలు

ఎన్నో అవార్డులు... రివార్డులు.. హెప్సిబగ్రేస్ సొంతం



గిన్నిస్ వరల్డ్ రికార్డు అవార్డును అందుకుంటున్న హెప్సిబగ్రేస్

పరిగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న కోనాపురం హిందీ టీచర్ హెప్సిబగ్రేస్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఈమె స్వగ్రామం అనంతపురం జిల్లా గుంతకల్లు. ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి, హిందీపై పట్టుఉన్న ఆమె 2002డీఎస్సీ ద్వారా పరిగి మండలం కోనాపురంలో హిందీ ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి 22ఏళ్ల సర్వీసులో ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు. ఈమె ప్రస్తుతం కోనాపురం గ్రామం ఏపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్నారు. సామగ్రి ద్వారా సులభంగా హిందీ నేర్పుతున్నారు. భాషను బోధనా సామగ్రి ద్వారా నేర్పడం అరుదు. వినూత్న బోధన పద్ధతుల ద్వారా బోధించవచ్చని ఈమె నిరూపించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి అర్థమయ్యేరీతిలో బోధన చేస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని హల్లెల్ మ్యూజిక్ క్లాస్‌లో ఆన్‌లైన్ ద్వారా ఒకే సమయంలో 1046మంది కీబోర్డ్ ఇన్‌స్ట్రిమెంట్‌లు ప్లేచేసి ఈ వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడంతో హెప్సిబగ్రేస్‌కు గిన్నీస్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కింది. ఒకవైపు ఉపాధ్యాయురాలిగా బాధ్యత నిర్వహిస్తూ సామాజికసేవలో భాగంగా మొక్కలు నాటడం, బాల్య వివాహాలపట్ల అవగాహన, చదువుపట్ల ఆసక్తిచూపడం, బడిమానేసిన పిల్లలకు తిరిగి పాఠశాలకు రప్పించడం వంటివి చేస్తున్నారు ఈ టీచర్. పేద పిల్లలకు, వికలాంగులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు అందిస్తూ వస్తున్నారు. ఉపాధ్యాయురాలిగా ఈమెచేసిన సేవలు గుర్తించి 2023లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. 2023ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ స్టార్ బుక్‌ఆఫ్ రికార్డులో చోటుదక్కించుకుంది. 2024ఫిబ్రవరి2న ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్‌లో చోటుదక్కించుకున్నారు. 2024మే24న ఐసీడబ్ల్యుఆర్ గోల్డెన్ ఐకాన్ బెస్ట్ టీచర్ అవార్డు దక్కించుకున్నారు. 2024బుక్‌ఆఫ్ రికార్డు బెస్ట్ టీచర్‌గా అవార్డు ఇచ్చారు. 2024 సెప్టెంబరు 14న బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చేతులమీదుగా బెస్ట్ హిందీ టీచర్‌గా అవార్డు దక్కించుకున్నారు. 2024ఫిబ్రవరిలో ఆసియా బుక్ ఆఫ్ రికార్డును, 2025ఏప్రిల్ 14న గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు.



తనకు వచ్చిన అవార్డులతో హిందీ టీచర్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జడ్పీటీసీ ఉమేష్

అగళి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రేణుక ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మశాంతికోసం రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని అభివృద్ధి కూడా కుంటుపడిందని సర్పంచులు, ఎంపీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయని, ఒక్క సమస్యకూడా పరిష్కారం కావడంలేదన్నారు. అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. జడ్పీటీసీ ఉమేష్ మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అభివృద్ధికి సంబంధించిన పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. మండల అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఏఓ రాజేంద్రప్రసాద్ అధికారులను కోరారు. వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ మాట్లాడుతూ రైతుల నుంచి ప్రభుత్వం రాగులను కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. వైద్యాధికారి శివానంద మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్తగా పీఎంఏవై ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ అరుణ్‌కుమార్ తెలిపారు. కొత్తగా 35వాటర్ ట్యాంకులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలో రూ.3కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని పంచాయతీరాజ్ ఏఈ రామాంజినేయులు తెలిపారు.

రోడ్లు, డ్రైనేజీలను నిర్మించండి



కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వీధుల్లో రోడ్లు, డ్రైనేజీలు అధ్వాన్నంగా తయారయ్యాయని మురుగునీరు రోడ్లపై ప్రవహించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమస్య పరిష్కరించాలంటూ ప్రజలు టీడీపీ నాయకులకు తమగోడును వెల్లబోసుకున్నారు. ఎగువగడ్డ, పాత పోస్టాఫీసువీధి, చెరువురోడ్డులలో పర్యటించి సమస్యల గురించి టీడీపీ ఆయా ప్రాంతవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయా కాలనీవాసులు వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యలన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, రమణమ్మ, త్రివేంద్ర, పొలడుగు చంద్ర, సాయిప్రసాద్, ప్రబంజన్, బీజేపీ రామాంజినేయులు, క్రిష్ణమూర్తి, సుబ్రమణ్యం, చంద్రకాంతమ్మ, నారాయణనాయక్, నరేంద్ర, రామాంజినేయులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు

హిందూపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం తూమకుంట పారిశ్రామికవాడలో కార్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఉదయం 10గంటలకు ఎస్‌బిఐ సర్కిల్‌లో ర్యాలీ, సమావేశం ఉంటుందన్నారు. కార్మికులంతా తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయుసీ నాయకులు, కార్మిక సంఘాలు, అనుబంధ సంఘాలు ప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో బాబు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

హిందూపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ హరీష్‌బాబు తెలిపారు. బుధవారం ఉదయం 11గంటల నుంచి 2గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. హిందూపురంలో ఐదు సెంటర్లలో 1597మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. బాలాజీ విద్యావిహార్, సప్తగిరి, బాలయేసు డిగ్రీ, జూనియర్‌కళాశాల, ఎంజీఎంపాఠశాలలో పరీక్ష కేంద్రాలుంటాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సమయానికి రావాలన్నారు. వచ్చేటప్పుడు హాల్‌టికెట్ తప్పక తీసుకురావాలన్నారు. ఆప్లేచేసి ఎవరికైనా హాల్‌టికెట్ అందకపోతే ఉదయం 9గంటలలోపు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌కళాశాలను సంప్రదించాలన్నారు.

చినుకు పడితే చిత్తడే..

అమరాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హాలేనపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షానికి రహదారి బురదమయంగా మారింది. వర్షపునీరు రోడ్డుపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, నడిచి కూడా వెళ్లలేకపోతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వర్షం నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మోహన్‌కుమార్, రుద్రప్ప, రాజునాయక్ కోరారు.



బురదమయమైన రహదారి

'ఆర్డీటీ సేవలు కొనసాగించండి'



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలు కొనసాగించాలని ఏఐటీయుసీ వ్యవసాయకార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం నాయకులు బాలస్వామి, రమేష్ వినతిని ఉమ్మడిజిల్లాల్లో ఎస్సీ ఎస్టీ, వెనుకబడిన వర్గాలకు, పిల్లలకు ఉచిత ఉన్నత విద్యకోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ఆర్డీటీ చేపట్టిందన్నారు. కేంద్రప్రభుత్వం ఆర్డీటీకి సంబంధించి ఎఫ్‌సి, ఆర్సీ నంబరు రెన్యూవల్ చేయకపోవడంతో నిధులులేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. వెంటనే ఈ సంస్థకు ఎఫ్‌సీ ఆర్‌సీని వెంటనే రెన్యువల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, శ్రీకాంత్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆర్డీఓకు వినతిని అందిస్తూ రైతులు పంటల కోసం బ్యాంకులు ఇస్తున్న పంట రుణాలను వడ్డీమాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని కోరారు. కొంతమంది బ్యాంక్ అధికారులు పంట రుణాలు రెన్యూవల్ కోసం రైతులు తీసుకున్న రుణాలు మొత్తంతోపాటు వడ్డీ చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తున్నారని రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కావున అధికారులు బ్యాంక్‌వారితో మాట్లాడి వడ్డీమాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, బాబావలిచ తిప్పన్న, మహబూబ్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్యకేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

పావగడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్షను కోర్టు విధించింది. వెంకటాపురం గ్రామానికి చెందిన బాలాజీ వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని భార్య కవిత మందలించడంతో వారి మధ్య ఘర్షణ సాగింది. అనంతరం 2019లో మార్చి 23న పావగడ కోర్టుకు కవిత నడిచి వస్తుండగా ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ ముందు బాలాజీ కొడవలితో అతికిరాతకంగా నరికి చంపాడని కవిత సోదరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ వెంకటేశ్ కేసు నమోదుచేసి నాలుగవ అడిషినల్ కోర్టుకు అందించగా వాదోపవాదాలను పరిశీలించిన న్యాయాధికారి బాలాజీకి యావజ్జీవ శిక్షను విధిస్తూ మంగళవారం తీర్పు విధించారు.

పౌష్టికాహారంతో బిడ్డకు ఆరోగ్యం

సోమందేపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారమే తల్లి, బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. తల్లి గర్భం లో ఉన్నప్పటి నుంచి శిశువు పెరిగి రెండేళ్ల వచ్చేంతవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి ఆమె అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె పాల్గొని పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనశాలను సందర్శించారు. అదేవిధంగా పలువురు గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంఈఓ ఆంజనేయులునాయక్, ఏపీఎం మదన్‌మోహన్, టీడీపీ నాయకులు ఆంజనేయులు, సిద్ధలింగప్ప, సూరీ, కిష్టప్ప, శ్రీరాములు, వెంకటేశులు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ



రైతులకు ట్రాన్స్ ఫార్మర్లను అందిస్తున్న అధికారులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో పలు మండలాల్లో విద్యుత్‌శాఖ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తామని కబురు పెట్టి పత్తాలేకుండా పోతున్నారని సోమవారం ట్రాన్స్‌ఫార్మర్లు కోసం వచ్చిన రైతులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో ఆంధ్రజ్యోతి పత్రికలో ఆగ్రహించిన అన్నదాత కథనం ప్రచురితం అయింది. దీంతో స్పందించిన ఆ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. పట్టణ సమీపంలోని వడ్రపాళ్యం సబ్‌స్టేషన్ వద్ద సీనియారిటీ ప్రకారం 69 మంది రైతులకు పంపిణీ చేశారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతిరైతుకూ అందజేస్తాం..

దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ ట్రాన్స్‌ఫార్మర్లను అందించడం జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 70 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన వారికి కూడా అందించడం జరుగుతుందన్నారు. రైతులు సమన్వయంతో ఉండాలన్నారు. ఎవరు డబ్బు అడిగినా ఇవ్వవద్దని సూచించారు. ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గోరంట్ల మండలంలోని కదిరి ప్రధాన రహదారిపై రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. పెట్లగుంటపల్లికి చెందిన డీలర్ చంద్రశేఖర్, గోరంట్లకు వచ్చి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో తిరిగి వెళ్తుండగా తిప్పరాజుపల్లి వద్ద కుక్క అడ్డురావడంతో వాహనం అదుపు తప్పిబోల్తా పడింది. ప్రమాదంలో గాయపడటంతో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తరలించారు. గోరంట్లలోని ఎస్ఎపిఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో సిరగమవాండ్లపల్లికి చెందిన అంజనేయులు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కళాశాల వద్దకు రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా కసిరెడ్డిపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తీసుకెళ్లారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిని పాపిరెడ్డిపల్లివద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంజీవమ్మగాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమందేపల్లి వినాయకనగర్‌కు చెందిన సంజీవమ్మ ఈతకాయలు కోసుకురావడానికి పాపిరెడ్డిపల్లివద్ద ఉన్న మామిడితోపువద్దకు వెళ్లింది. కాయలు కోసుకుని జాతీయరహదారి దాటుతుండగా కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. మెరుగైన వైద్యం కోసం హిందూపురానికి తరలించారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

పావగడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే వెంకటేశ్ పేర్కొన్నారు. మంగళవారం పావగడలోని గురుభవన్‌లో పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పకడ్బందీగా నిర్వహించండి: ఆర్డీఓ

పెనుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో రెండో విడతగా గ్రామాల్లో చేపట్టిన భూసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఫేస్-2 భూరీసర్వేపై డివిజన్‌కు చెందిన వీఆర్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూరీసర్వే త్వరితగతిన పూర్తిచేయాలని ఎలాంటి వివాదాలకు చోటు కల్పించకుండా పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డివిజన్‌కు చెందిన తహసీల్దార్‌లు, రీసర్వే డీటీలు మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.